సాక్షి
నిజామాబాద్

ఆదివారం | 29 | సెప్టెంబర్ | 2024



రాజీతోనే కేసుల పరిష్కారం

రాజీతోనే కేసులు పరిష్కారమవుతాయని జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల అన్నారు.

- 8లో ▸



క్రీడలకు ప్రోత్సాహం..

రాష్ట్ర ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహిస్తోందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే భూపతిరెడ్డి అన్నారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
32.0 /22.2

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ తేలికపాటి వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయి. రాత్రి చలి తీవ్రత పెరుగుతుంది.


న్యూస్‌రీల్

కొనసాగుతున్న నీటి విడుదల



బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి 16 గేట్ల ద్వారా నీటి విడుదల కొనసాగుతోంది. ఎగువ నుంచి 84 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతుండటంతో దిగువ గోదావరిలోకి 60 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. వరద కాలువ ద్వారా 15 వేల క్యూసెక్కులు, కాకతీయ కాలువ ద్వారా 6,800, ఎస్కేప్ గేట్ల ద్వారా 1200, లక్ష్మి కాలువ ద్వారా 150 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తుండగా, ఆవిరి రూపంలో 709 క్యూసెక్కుల నీరుపోతోంది. మిషన్ భగీరథకు 231 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నారు. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి మట్టం 1091(80.5 టీఎంసీలు) అడుగులు కాగా శనివారం సాయంత్రానికి అంతే స్థాయి నీటి మట్టంతో ప్రాజెక్ట్ నిండుకుండలా ఉంది.

నిజాంసాగర్‌లోకి 24,500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో



నిజాంసాగర్: సింగూరు ప్రాజెక్టు గేట్లను ఎత్తడంతో నిజాంసాగర్ ప్రాజెక్టులోకి శనివారం 24,500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోందని నీటిపారుదల శాఖ ఏఈ శివప్రసాద్ తెలిపారు. దీంతో ప్రాజెక్టు మూడు గేట్లను ఎత్తి అంతే నీటిని మంజీర నదిలోకి విడుదల చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1,405 అడుగుల(17.8 టీఎంసీలు)తో నిండుకుండలా ఉందని తెలిపారు.

ధ్రువపత్రాల పరిశీలన

నిజామాబాద్‌అర్బన్: డీఈడీ, డీపీఎస్‌ఈలో అడ్మిషన్ల కోసం మరోసారి ధ్రువపత్రాలను పరిశీలించనున్నట్లు డైట్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. డీఈఈసెట్–2024లో ప్రవేశ పరీక్షలో అర్హత సాధించిన వారు, గతంలో ధ్రువపత్రాల పరిశీలనకు హాజరుకాని వారు అక్టోబర్ 1వ తేదీన మరోసా హాజరుకావాలని సూచించారు. అభ్యర్థులు తమవెంట ఒరిజినల్ ధ్రువపత్రాలు తీసుకురావాలని పేర్కొన్నారు.

ఎంబీఏ, ఎంసీఏ ప్రవేశాలకు స్లాట్ బుకింగ్

నిజామాబాద్‌అర్బన్: ఎంబీఏ, ఎంసీఏ ప్రవేశా ల కోసం ఈనెల 30 నుంచి స్లాట్ బుకింగ్ ఉంటుందని పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ నరేశ్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. టీజీఐసెట్–24 ద్వారా ప్రత్యేక కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. స్లాట్ బుకింగ్ తర్వాత విద్యార్థులు అక్టోబర్ 1 నుంచి ఎంపిక చేసిన హెల్ప్‌లైన్ సెంటర్లలో ధ్రువపత్రాల పరిశీలన కు హాజరు కావాలన్నారు. అనంతరం వెబ్ ఆప్షన్స్ ద్వారా కళాశాలలను ఎంపిక చేసుకోవాలన్నారు.

గుండె పదిలమేనా..

వయస్సుతో సంబంధం లేకుండా మరణాలు

- మారుతున్న జీవనశైలి, మానసిక ఒత్తిళ్లూ కారణమే..
- జిల్లాలో ప్రతి నెలా వందల సంఖ్యలో బాధితులు
- నేడు వరల్డ్ హార్ట్ డే







శరీరంలో నిరంతరం రక్తం పంప్‌చేయడంతోపాటు ఆక్సిజన్ అందించే గుండె విశ్రాంతి అనేది ఎరుగదు. అలాంటి అతిముఖ్యమైన అవయవం చిన్నాపెద్ద అనే తేడా లేకుండా.. అసలు సమస్య ఏమిటో తెలియకుండానే ఆగిపోతోంది. కార్డియాక్ అరెస్ట్.. సైలెంట్ హార్ట్ ఎటాక్.. పేరేదైనా గుండెపోటుతో ప్రాణాలు పోతున్నాయి. పాతికేళ్లు నిండనివారూ గుండెపోటుకు గురవుతుండడం ఆందోళన కలిగిస్తోంది. జిల్లాలో ప్రతి నెలా సుమారు 400 మంది గుండె వైద్య నిపుణులను సంప్రదిస్తుండగా, 150 మందికిపైగా స్టంట్‌లు వేసుకుంటున్నారు. సుమారు 30 బైపాస్ సర్జరీలు అవుతున్నాయి. 30 నుంచి 40 ఏళ్ల వయస్సున్న ప్రతి వంద మందిలో ఇద్దరికి గుండెపోటు వస్తోంది. వరల్డ్ హార్ట్ డే సందర్భంగా 'సాక్షి' ప్రత్యేక కథనం.

నిజామాబాద్‌నాగారం: ఒకప్పుడు వయస్సు పైబడిన వారికి, ధూమ, మద్యపానం అలవాట్లున్న వా రికి పరిమితమైన గుండెపోటు.. ఇప్పుడు అన్ని వయస్సుల వారిని ఆందోళనకు గురి చేస్తోంది. పాతికేళ్లు కూడా నిండని వారు గుండెపోటుకు గురై ప్రాణాలు కోల్పోతున్నారు. షాకింగ్ వార్తలే కాదు.. సడెన్ సర్‌ప్రైజ్‌లు గుండెపోటుకు కారణమవుతున్నాయంటే మన గుండె ఎంత బలహీనంగా మారుతోందో అర్థం చేసుకోవచ్చు. అతి వ్యాయామం అనర్థమే అని అంటోంది మన గుండె. ఇక మానసిక ఒత్తిడి, జంక్‌ఫుడ్, రెగ్యులర్ ప్రైవేట్ పార్టీలు, డీజే చప్పుళ్లు, బీపీ, ఆల్కహాల్, స్మోకింగ్ వంటి అలవాట్ల కారణంగా గుండెపోటుకు గురవుతున్నారు.

కారణాలివి..

గుండెపోటుకు మన జీవన శైలిలో మార్పులే ప్రధాన కారణం. హోటళ్లలో బిర్యానీలు, జంక్, ఫాస్ట్ ఫుడ్, మితిమీరిన పార్టీలు, అర్ధరాత్రి వేళల్లో నాన్‌వెజ్ తీసుకోవడం వంటి గుండె పోటుకు కారణమవుతున్నాయి. హార్మోన్‌ల ప్రభావమూ కొంత వరకు ఉంటోంది. కంప్యూటర్లు, సెల్ ఫోన్‌లు పట్టుకొని గంటల తరబడి కూర్చునేవారు, రాత్రి వేళ్లలో నిద్రపోకుండా మేల్కొని ఉండేవారు, అతిగా ఆహారం తీసుకుంటూ ఏ పని చేయని వారు గుండెపోటుబారిన పడుతున్నారు. మానసిక ఒత్తిడి, ఆర్థిక ఇబ్బందులూ గుండెపోట్లకు దారితీస్తున్నాయి.

డీజే శబ్దం ప్రాణం తీసింది



మాక్లూర్ మండలం ముత్యంపల్లి గ్రామానికి చెందిన ఊరడి మధు డీజే సౌండ్ కారణంగా గుండె పోటుతో మృతి చెందాడు. వినాయక నిమజ్జనం కోసం ఈ నెల 17న మానిక్‌బండార్‌కు వచ్చిన మధు శోభాయాత్ర కొనసాగుతుండగానే రామాలయం వద్ద కుప్పకూలాడు. ఇలా ఎంతో మంది శబ్ద కాలుష్యం కారణంగానూ గుండెపోటుకు గురై చిన్న వయస్సులోనే మరణిస్తున్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలివి..

- మితఆహారం గుండెకు మేలు చేస్తుంది. మాంసాహారం తక్కువగా, పండ్లు, కూరగాయలు ఎక్కువగా తీసుకోవాలి
- ప్రతి రోజూ వ్యాయామం, వాకింగ్, యోగా చేయాలి.
- హోటల్ తిండికి దూరంగా ఉండాలి.
- రోజుకు 7 నుంచి 8గంటల పాటు నిద్రపోవాలి
- నీరు బాగా తీసుకోవాలి.
- బీపీ, షుగర్ కంట్రోల్‌లో ఉండాలి.
- హై, లో బీపీతో జాగ్రత్త
- స్మోకింగ్, ఆల్కహాల్‌కు దూరంగా ఉండాలి
- గుండె జబ్బులున్నా లేకున్నా భారీ శబ్దాలకు దూరంగా ఉండాలి.
- స్టంట్‌లు వేసుకున్న వారు, గుండె సంబంధిత ఆపరేషన్లు చేసుకున్న వారు డీజేల వద్దకు వెళ్లొద్దు.

గుర్తించాలిలా..



- ఛాతి బరువుగా ఉండటం.
- శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది
- తల తిప్పడం వంటివాటిని గుండెపోటు ప్రథమ లక్షణాలుగా భావించి వెంటనే జనరల్ ఫిజిషియన్ లేదా గుండె వైద్య నిపుణులను కలిసి చికిత్స తీసుకోవాలి.
- ఈసీజీ, 2డీ ఎకో తర్వాతే గుండె సమస్య తీవ్రత తెలుస్తుంది. ఆ తరువాతే చికిత్స తీసుకోవాల్సి ఉంటుంది.

సీపీఆర్‌తో ప్రాణాలు కాపాడొచ్చు



సీపీఆర్(కార్డియో పల్మరీ రిసస్కిటేషన్)పై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలి. గుండె కొట్టుకోవడం ఆగిన వెంటనే సీపీఆర్ చేస్తే శ్వాసక్రియను పునరుద్ధరించి ప్రాణాలను కాపాడవచ్చు. దీనిపై వైద్యులతోపాటు స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నారు. అయితే, గుండెపోటుకు గురైన పది మందిలో ఒక్కరు మాత్రమే సీపీఆర్ ద్వారా ప్రాణాలతో భయటపడుతున్నారు.

మన చేతుల్లోనే ఉంది



గుండెను కాపాడుకోవడం మన చేతుల్లోనే ఉంది. ఆహార నియమాలు పాటించకపోవడం, దురలవాట్ల కారణంగా ఇబ్బందుల పాలవుతున్నారు. మంచి అలవాట్లు ఉన్న వారికి 60 ఏళ్లు దాటినా గుండెపోటు రాదు. చెడు వ్యసనాలతో ఆరోగ్యాన్ని పాడుచేసుకోవద్దు. సౌండ్ పొల్యూషనూ పెరుగుతోంది. డీజేలకు దూరంగా ఉండాలి. అన్ని వయస్సుల వారు ఆలోచించి తమ గుండెను పదిలంగా కాపాడుకోవాలి.

– సందీప్‌రావు,
ప్రముఖ గుండె వైద్య నిపుణులు

జిల్లాలో డీజేలు బంద్

ఖలీల్‌వాడి: పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఈనెల 30 నుంచి అక్టోబర్ 14 వరకు డీజేలను బంద్ చేయాలని, లేనిపక్షంలో కేసులు నమోదు చేస్తామని సీపీ కల్మేశ్వర్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సిటీ పోలీస్ యాక్ట్ ప్రకారం కేసులు నమోదు చేస్తామని, ప్రజలు శబ్ద కాలుష్యంతో ఇబ్బందులు పడుతున్నారని, దీనిపై హైకోర్టు సైతం జడ్జిమెంట్ ఇచ్చినట్లు తెలిపారు. డీజే నిర్వాహకులపై ఆయా పోలీస్‌స్టేషన్‌ల ఎస్సైలు దృష్టి సారించాలని సూచించారు.

4న తెయూ వీసీ సెర్చ్ కమిటీ సమావేశం



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: తెలంగాణ యూనివర్సిటీ ఉపకులపతి నియామకానికి సంబంధించిన సెర్చ్ కమిటీ సమావేశం అక్టోబరు 4న మధ్యాహ్నం 12 గంటలకు రాష్ట్ర సచివాలయంలో జరుగనుంది. ఈ మేరకు విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి బుర్ర వెంకటేశం శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సెర్చ్ కమిటీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎ శాంతి కుమారి, యూజీసీ నామినీ లైన హిమాచల్ ప్రదేశ్‌లోని వైయస్ పార్మర్, హార్టికల్చర్ యూనివర్సిటీ వీసీ ఆచార్య రాజేశ్వర్ సింగ్ చందేల్, ఉస్మానియా వర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ సులేమాన్ సిద్దిఖీ సభ్యులుగా ఉన్నారు. గత ఏడాది జూన్17న అప్పటి తెయూ వీసీ రవీందర్ గుప్తా అవినీతి కేసులో అరెస్ట్ అయినప్పటి నుంచి వర్సిటీలో ఇన్‌చార్జి వీసీల పాలన కొనసాగుతోంది. ఇప్పటివరకు ముగ్గురు ఐఏఎస్ అధికారులు ఇన్‌చార్జి వీసీలుగా వ్యవహరించారు. వాకాటి కరుణ, బుర్ర వెంకటేశం, ప్రస్తుతం సందీప్ కుమార్ సుల్తానీయా ఇన్‌చార్జి వీసీగా ఉన్నారు. 100 మందికి పైగా తెయూ వీసీ కోసం దరఖాస్తులు చేసుకున్నారు. పరిశోధన, పాలనా పరమైన అనుభవంతో పాటు ట్రాక్ రికార్డును పరిగణనలోకి తీసుకుని ముగ్గురి పేర్లతో కూడిన జాబితా రూపొందించి గవర్నర్ కు పంపిస్తారు. గవర్నర్ వారిలో ఒకరిని ఖరారు చేసి తిరిగి ప్రభుత్వానికి పంపిస్తారు.

గురుకులంలో కలెక్టర్ బస



విద్యార్థులను చదివిస్తున్న కలెక్టర్ హనుమంతు



విద్యార్థులతో కలిసి నిద్రపోయిన కలెక్టర్

బాల్కొండ: మెండోరా మండలం పోచంపాడ్ కూడలిలో ఉన్న బాలుర గురుకుల పాఠశాలలో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు శనివారం రాత్రి బస చేశారు. ఏడు గంటల ప్రాంతంలో పాఠశాలకు వచ్చిన ఆయన.. ముందుగా విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు పట్టికలను, అనంతరం వసతి గృహాలను, కిచెన్, డైనింగ్ హాలును పరిశీలించారు. విద్యార్థులు ఒక్కసారిగా భోజనం కోసం లైన్ కట్టడం చూసి ఇరుకుగా ఉన్న డైనింగ్ హాలుపై వెంటనే నివేదిక ఇవ్వాలని సూచించారు. విద్యార్థులతో మాట్లాడి.. వారితో పలు పాఠ్యాంశాలు చదివించారు. ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మెనూ వివరాలను ప్రిన్సిపాల్ సురేందర్‌ను అడిగి తెలుసుకున్నారు. హాజరు పట్టికల్లో విద్యార్థుల పేర్లు, హాజరు సరిగా లేక పోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. రాత్రికి విద్యార్థులతో కలిసి వసతి భవనంలో నిద్రపోయారు. ఆయన వెంట ఆర్మూర్ ఆర్డీవో రాజాగౌడ్, పాఠశాల ఉపాధ్యాయులు ఉన్నారు.

నిధులిస్తున్నా పనులు చేపట్టడం లేదు

- అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలి
- అక్టోబర్ రెండో వారంలో ప్రత్యేక సమావేశం
- దిశ సమావేశంలో ఎంపీ ధర్మపురి అర్వింద్



మాట్లాడుతున్న ఎంపీ అర్వింద్, పక్కన ఎమ్మెల్యేలు ధన్‌పాల్, రాకేశ్‌రెడ్డి, కలెక్టర్ హనుమంతు

నిజామాబాద్‌అర్బన్: కేంద్ర నిధులు ఇస్తున్నా అభివృద్ధి పనులు ఎందుకు చేపట్టడం లేదని ఎంపీ ధర్మపురి అర్వింద్ అధికారులను ప్రశ్నించారు. పనులు సకాలంలో పూర్తయ్యేలా పర్యవేక్షించాలని సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం సమావేశ మందిరంలో శనివారం ఎంపీ అర్వింద్ అధ్యక్షతన జిల్లా అభివృద్ధి సమన్వయ, మానిటరింగ్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో వివిధ శాఖల ఆధ్వర్యంలో చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల ప్రగతిపై చర్చించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. మాక్లూర్ మండలం అడవి మామిడిపల్లి వద్ద రోడ్డు నిర్మాణంతోపాటు ఆయా చోట్ల రహదారుల నిర్మాణ పనులు మందకొడిగా సాగుతున్నాయని, పెండింగ్ పనులపై చర్చించేందుకు అక్టోబర్ రెండో వారంలో ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. వివిధ పథకాల కింద కేంద్ర ప్రభుత్వం ద్వారా మంజూరైన పనులు ఏ దశలో ఉన్నాయి, వెచ్చించిన నిధుల వివరాలను తెలుపుతూ సమగ్ర నివేదికలు అందజేయాలని ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్, జాతీయ రహదారులు, ఫారెస్ట్ తదితర శాఖల అధికారులను ఆదేశించారు. విద్యాశాఖకు కేంద్రం మంజూరు చేసిన నిధులపై ఎంపీ ప్రశ్నించగా.. పీఎంశ్రీ పథకం కింద 40 పాఠశాలలకు రూ.20 కోట్లు మంజూరయ్యాయని డీఈవో దుర్గాప్రసాద్ తెలిపారు. అదనపు తరగతి గదులు, లైబ్రరీలు, ప్రయోగశాలలు, క్రీడా పరికరాలు, మైదానాల అభివృద్ధి పనుల కోసం వెచ్చిస్తున్నామని వివరించారు. జిల్లాకు రూ.335 కోట్ల అమృత్ నిధులు మంజూరయ్యాయని, నిజామాబాద్ నగరంతోపాటు బోధన్, ఆర్మూర్, భీమ్‌గల్ పట్టణాల్లో తాగునీటి వ్యవస్థ మెరుగుపర్చేందుకు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు వెచ్చిస్తున్నామని ప్రజారోగ్య శాఖ ఈఈ తిరుపతికుమార్ తెలిపారు. అలాగే కాంపా నిధులు, విశ్వకర్మ పథకంపై ఎంపీ సమీక్షించారు. సమావేశంలో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్ అంకిత్, నగరపాలక సంస్థ కమిషనర్ మకరంద్, డీఆర్డీవో సాయాగౌడ్, ఆయా శాఖల అధికారులు, దిశా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రొటోకాల్ రగడ



మాట్లాడుతున్న ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి

అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి ప్రొటోకాల్ పాటించడం లేదని ఎమ్మెల్యేలు ధన్‌పాల్, పైడి రాకేశ్‌రెడ్డి పేర్కొనగా, ప్రజాప్రతినిధుల గౌరవానికి భంగం కలిగించేలా ప్రవర్తిస్తే ఉపేక్షించేది లేదని ఎంపీ స్పష్టం చేశారు. కలెక్టర్ మౌనం వహిస్తున్నారని, అధికారులు తమకు గౌరవం ఇవ్వడం లేదని రాకేశ్‌రెడ్డి అన్నారు. మున్సిపల్ ఈఈ తిరుపతి రెండుసార్లు సమావేశం నిర్వహించినా తనకు సమాచారం ఇవ్వలేదని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు.

ఇన్‌చార్జి మంత్రిపై ఫైర్

జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి జిల్లాకు రాక ఎన్ని రోజులవుతోందని ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి ప్రశ్నించారు. ఆయన జిల్లా వైపు కన్నెత్తి చూడడం లేదని, అభివృద్ధి పనులు ఆగిపోతున్నాయని మండిపడ్డారు. ఆయన పేషీని తగులబెట్టాలని ఫైరయ్యారు. జిల్లాలో అటవీ సంపద తగ్గిపోతోందని, అధికారులు ఏం చేస్తున్నారన్నారు.

సుదర్శన్‌రెడ్డిని మంత్రిగానే భావిస్తున్నాం

దిశ సమావేశం అనంతరం ఎంపీ అర్వింద్ విలేకరులతో మాట్లాడారు. మంత్రి పదవి లేక బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అలిగి పనులు చేపట్టడం లేదని, జిల్లాను పట్టించుకోవడం లేదన్నారు. సుదర్శన్‌రెడ్డిని తాము మంత్రిగానే భావిస్తున్నామని, అభివృద్ధి పనుల్లో జాప్యం మంచిదికాదన్నారు. ఆయనకు మంత్రి పదవి ఇచ్చి అభివృద్ధి పనులు జరిగేలా చూడాలన్నారు. మామిడిపల్లి రైల్వే ఓవర్ బ్రిడ్జికి సంబంధించిన రూ.18 కోట్లు పక్కదారి పట్టించారని, ప్రస్తుతం చెల్లించడంలోజాప్యం చేస్తున్నారని మండిపడ్డారు.

గ్రామీణ ఓటర్లు @ 8,30,580

- వార్డులవారీగా తుది జాబితా విడుదల
- మహిళా ఓటర్లే కీలకం..

సుభాష్‌నగర్: రాష్ట్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకారం గ్రామ పంచాయతీల్లో వార్డుల వారీగా తుది ఓటరు జాబితా శనివారం విడుదలైంది. మొత్తం 5022 వార్డు స్థానాల్లో 8,30,580 మంది ఓటర్లున్నారు. 3,87,017 మంది పురుషులు, 4,43,548 మంది మహిళా ఓటర్లు, 15 మంది ఇతరులు ఉన్నారు. నిజామాబాద్ ఉత్తర, దక్షిణ మండలాలు కార్పొరేషన్ పరిధిలో ఉండటంలో ఆయా మండలాల ఓటర్ల వివరాలు రూపొందించలేదు. అత్యధికంగా నందిపేట్ మండలంలో 58,167 మంది ఓటర్లు, చందూర్‌లో అత్యల్పంగా 8,723 మంది ఉన్నారు.

పెరిగిన ఓట్లు..

స్థానిక సంస్థల ఎన్నికల్లో మహిళా ఓటర్లే కీలకం కానున్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో పురుషుల కంటే 56,531 మంది మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారు. ఇప్పటికే గ్రామ పంచాయతీల్లో సర్పంచులు, ఎంపీటీసీ స్థానాలు, వార్డు స్థానాల్లో 50 శాతం మహిళలకు రిజర్వేషన్లు కల్పిస్తున్నారు. ముసాయిదా ఓటరు జాబితాతో పోల్చితే తుది జాబితాలో 1,117 ఓటర్లు పెరిగారు. జీపీలు, మండలాల్లో అభ్యంతరాలు స్వీకరించిన అధికారులు వాటిని పరిష్కరించి టీ పోల్‌లో నమోదుచేశారు.

మండలాల వారీగా..

మండలం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం ఓటర్లు
ఆర్మూర్	19,934	23,548	1	43,483
బాల్కొండ	11,610	13,581	-	25,191
భీమ్‌గల్	17,654	20,534	1	38,189
బోధన్	22,988	24,841	2	47,831
చందూరు	4,200	4,523	-	8,723
ధర్పల్లి	14,549	16,744	-	31,293
డిచ్‌పల్లి	21,083	24,303	-	45,386
ఇందల్వాయి	13,962	16,112	1	30,075
జక్రాన్‌పల్లి	15,858	18,468	-	34,326
కమ్మర్‌పల్లి	13,504	15,773	-	29,277
కోటగిరి	19,096	20,845	2	39,943
మాక్లూర్	18,460	21,761	-	40,221
మెండోరా	9,511	11,112	-	20,623
మోర్తాడ్	12,404	14,533	-	26,937
మోస్రా	4,821	5,413	1	10,235
మోపాల్	13,756	16,179	-	29,935
ముప్కాల్	7,334	8,572	-	15,906
నందిపేట్	26,726	31,438	3	58,167
నవీపేట్	21,382	24,521	-	45,903
ని.రూరల్	10,011	11,230	3	21,244
రెంజల్	13,961	15,151	-	29,112
రుద్రూర్	8,088	8,983	-	17,071
సిరికొండ	15,700	17,560	-	33,260
వేల్పూర్	16,704	19,864	-	36,568
వర్ని	12,734	13,816	-	26,550
ఎడపల్లి	14,429	16,518	1	30,948
ఏర్గట్ల	6,558	7,625	-	14,183

మెడికోల సందడి



మెడికల్ కళాశాల వార్షికోత్సవాల్లో భాగంగా శనివారం ట్రెడిషనల్ డేను నిర్వహించారు. మెడికోలు సంప్రదాయ దుస్తులు ధరించి ఆకట్టుకున్నారు. వైద్య వృత్తి ఎంతో గొప్పదని రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి అన్నారు.

వివరాలు 8లో..

క్లుప్తంగా

రీ వాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోండి

తెయూ(డిచ్‌పల్లి): తెయూ పరిధిలో ఆగస్టులో నిర్వహించిన పీజీ, ఇంటిగ్రేటెడ్ పీజీ, ఎల్ఎల్‌బీ 1, 3, 4, 5వ సెమిస్టర్ బ్యాక్‌లాగ్, పీజీ, ఇంటిగ్రేటెడ్ పీజీ, ఎల్ఎల్‌బీ 6వ సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలకు సంబంధించి రీ వాల్యుయేషన్‌కు అవసరమైన వారు దరఖాస్తు చేసుకోవాలని కంట్రోలర్ అరుణ శనివారం పేర్కొన్నారు. ఒక్కో పేపర్‌కు రూ.500 చెల్లించాలన్నారు. ఈ ఫీజు చెల్లింపునకు అక్టోబర్ 1 తుది గడువని కంట్రోలర్ తెలిపారు.

డిగ్రీ, పీజీ ప్రవేశాలకు..

నిజామాబాద్‌అర్బన్: అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీ, పీజీ ప్రవేశాలకు విద్యార్థులు ఈనెల 30లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కో–ఆర్డినేటర్ రంజిత శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న పత్రాలను సెంటర్‌లో సమర్పించలన్నారు. అలాగే పీజీ డిగ్రీ రెండో, మూడో ఏడాది విద్యార్థులు ట్యూషన్ ఫీజును ఈనెల 30వ తేదీలోగా చెల్లించాలన్నారు.

మృణాళినికి డాక్టరేట్



ఆర్మూర్: పట్టణానికి చెందిన నటరాజ నృత్యానికేతన్ నాట్య గురువు బాచెట్టి మృణాళికి శనివారం న్యూఢిల్లీలో వరల్డ్ హ్యూమన్ రైట్ ప్రొటెక్షన్ కమిషన్ సభ్యులు ఆర్ట్, కల్చర్ విభాగంలో డాక్టరేట్‌ను అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆంధ్రనాట్యంలో 20 ఏళ్లుగా కళాకారురాలిగా సనాతన ధర్మంపై, సాంస్కృతిక కార్యక్రమాలపై పిల్లలకు శాస్త్రీయ నృత్యాన్ని నేర్పిస్తూ, మన కల్చర్ మీద అవగాహన కలిపిస్తున్న కృషిని అభినందిస్తూ గౌరవ డాక్టర్‌తో సత్కరించారన్నారు. అలాగే హ్యూమన్ రైట్ ప్రొటెక్షన్ కమిషన్‌లో వైస్ ప్రెసిడెంట్‌గా సభ్యత్వం ఇవ్వడం జరిగిందన్నారు.

తెయూలో 3న బతుకమ్మ ఉత్సవాలు

తెయూ: తెలంగాణ యూనివర్సిటీలో అక్టోబర్ 3న కంప్యూటర్ సైన్స్ కాలేజ్ భవనంలో బతుకమ్మ ఉత్సవాలను నిర్వహించనున్నట్లు ఉమెన్ సెల్ డైరెక్టర్ ఎం భ్రమరాంభిక శనివారం పేర్కొన్నారు. బోధన, బోధనేతర మహిళా సిబ్బందితో పాటు విద్యార్థినులు అధిక సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేయాలని కోరారు.

మెడికోల సందడి

- కొనసాగుతున్న మెడికల్ కాలేజ్ 11వ వార్షికోత్సవాలు
- ఉత్సాహంగా సాగిన ట్రెడిషనల్ డే

నిజామాబాద్‌నాగారం: జిల్లా కేంద్రంలోని మెడికల్ కాలేజ్ 11వ వార్షికోత్సవం సందర్భంగా శనివారం ట్రెడిషనల్ డే నిర్వహించారు. విద్యార్థినులు సంప్రదాయ దుస్తులు ధరించి ఆకట్టుకున్నారు. కార్యక్రమానికి నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి హాజరై మాట్లాడారు. వైద్య వృత్తి ఎంతో గొప్పదని అన్నారు. అనంతరం విద్యార్థులు ఫొటోషూట్, బతుకమ్మ, బోనాల ప్రదర్శన చేపట్టారు. కార్యక్రమంలో ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ శివప్రసాద్, జీజీహెచ్ సూపరింటెండెంట్ ప్రతిమారాజ్, వైస్ ప్రిన్సిపాల్ నాగమోహన్, మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్పాగంగారెడ్డి, ఐడీసీఎంఎస్ మాజీ చైర్మన్ మునిపల్లి సాయారెడ్డి, ప్రతినిధులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి



బతుకమ్మలతో విద్యార్థినులు



సంప్రదాయ దుస్తుల్లో విద్యార్థినులు





ఫొటో షూట్‌లో విద్యార్థినులు

సనాతన ధర్మాన్ని కాపాడాలి



సమ్మేళనంలో పాల్గొన్న రాష్ట్రీయ హిందూ వాహిని సంఘం జాతీయ సభ్యులు

- రాష్ట్రీయ హిందూ వాహిని సంఘం జాతీయ అధ్యక్షుడు మన్యవర్ రమేశ్‌చంద్ర

నందిపేట్: సనాతన ధర్మాన్ని కాపాడేందుకు ప్రతి హిందువు పాటుపడాలని రాష్ట్రీయ హిందూ వాహిని సంఘం జాతీయ అధ్యక్షుడు మన్యవర్ రమేశ్‌చంద్ర ద్వివేది అన్నారు. మండల కేంద్రంలోని శ్రీ కేదారేశ్వర ఆశ్రమంలో రెండు రోజుల పాటు నిర్వహించే హిందూ వాహిని సంఘటన్ జాతీయ సమావేశం శనివారం ప్రారంభమైంది. ముందుగా ఆశ్రమంలో సాధువులు, రాష్ట్రీయ సంఘ సభ్యులు కాషాయ జెండాను ఎగురవేసి ప్రారంభించారు. అనంతరం ఆయా రాష్ట్రాల హిందూ వాహిని అధ్యక్షులుగా నియమితులైన వారిచే ప్రమాణం చేయించారు. సమావేశంలో దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రముఖ స్వామిజీలు ప్రసంగించారు. సిద్ధియోగి మహరాజ్ మాట్లాడుతూ.. హిందూ భావజాలాన్ని ప్రతి ఇంటికి చేరవేస్తూ వారిని సంఘటితం చేయాలన్నారు. మన ధర్మాన్ని విచ్ఛిన్నం చేయడానికి కొన్ని శక్తులు ప్రయత్నిస్తున్నాయని, వాటిని సమూలంగా ప్రక్షాళన చేయాలని సూచించారు. సాధు, సంతులకు పదవులు అధికారాలు అవసరం లేవని, హిందూ ధర్మాన్ని ఆచరించే వారే దేశాన్ని పాలిస్తారన్నారు.

ఆశ్రమంలో నిర్వహించే హిందూ సమ్మేళన జాతీయ సమావేశంలో ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా హిందు మతం గొప్పతనాన్ని వివరించారు. కార్యక్రమంలో కేదారేశ్వర ఆశ్రమ వ్యవస్థాపకుడు మంగిరాములు మహరాజ్, వివిధ రాష్ట్రాల ప్రతినిధులు ఓం శక్తి సేవాధామ్ సంత్‌గౌరి మహరాజ్, స్వామి సిద్ధయోగి, భగవంత్‌రావు, డాక్టర్ జ్యోతి, దేవిశ్రీ మంజులత, మంగేశ్ భగవత్, శ్రీనివాస్, సాంబరు ప్రభాకర్, రాంకిశోర్ యాదవ్ మహామంతి, ద్వారక పీఠాధిపతి స్వామి త్రిలోకి స్వరూప తీర్థ, భక్తులు పాల్గొన్నారు.



కాషాయ జెండాను ఎగుర వేస్తున్న సభ్యులు

క్రీడలను ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం

- రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి
- ఉమ్మడి జిల్లా రెజ్లింగ్ జట్ల ఎంపికలు

మోపాల్: కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి క్రీడలను ప్రోత్సహిస్తున్నారని, గ్రామీణ ప్రాంత యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో రాణించాలని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి పేర్కొన్నారు. మోపాల్ మండలంలోని మంచిప్ప జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఉమ్మడి నిజామాబాద్ జిల్లా రెజ్లింగ్ అండర్–14, 17 బాలుర, బాలికల ఎంపిక పోటీలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. అదేవిధంగా మంచిప్ప పాఠశాలలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.20లక్షలతో మరుగుదొడ్లు, మూత్రశాలలు, వంటగది నిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. అదే విధంగా సేవాలాల్ విగ్రహ ఏర్పాటు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డికి క్రీడలపై ఆసక్తి మక్కువ అని, అందుకే స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. రాబోయే రోజుల్లో ఒలింపిక్స్, ఇతర అంతర్జాతీయ పోటీల్లో మన రాష్ట్రం నుంచి క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబర్చి బంగారు, కాంస్య, రజత పతకాలు సాధించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు.

250 మంది క్రీడాకారులు

ఉమ్మడి నిజామాబాద్ జిల్లా రెజ్లింగ్ పోటీల్లో 250 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. పీఈటీలు సంతోషి, దేవేందర్ ఆధ్వర్యంలో పోటీలు కొనసాగాయి. ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ నాగమణి, ఎంఈవో గేమ్‌సింగ్, ఎస్‌జీఎఫ్ ప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి



రెజ్లింగ్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

రీ సర్వే కోసం కమిటీ ఏర్పాటు

మంచిప్ప రిజర్వాయర్ ముంపు రీ సర్వే కోసం నిపుణులు, ఇంజినీర్లతో ప్రత్యేక కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసిందని ఎమ్మెల్యే భూపతిరెడ్డి పేర్కొన్నారు. పాత డిజైన్ ప్రకారమే పనులు చేపడతామని, ప్రస్తుతం చేపడుతున్న పనులను పరిశీలించి కమిటీ రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక ఇస్తుందన్నారు. రీ సర్వే కమిటీకి ప్రజలు సహకరించాలని కోరారు. కేవలం కమీషన్ల కోసమే మాజీ సీఎం కేసీఆర్ ప్రాజెక్టును రీ డిజైన్ చేశారని ఆరోపించారు. ప్రాజెక్ట్ ప్రస్తుత పరిస్థితిని సీడబ్ల్యూసీ కమిటీ మెంబర్ శ్రీరామ్‌కు వివరాలు పంపించామని, త్వరలో ఆయన ప్రాజెక్టును సందర్శిస్తారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి పాత డిజైన్ పనులు చేపట్టే విషయంలో సానుకూలంగా ఉన్నారని అన్నారు. 70శాతం పనులు పూర్తయ్యాయని, త్వరలో మిగతా 30శాతం పనులు పూర్తిచేస్తామన్నారు. డబుల్ బెడ్‌రూం ఇండ్లు అధికంగా కేటాయిస్తామని, మహిళా సంఘం భవనం మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, పీసీసీ డెలిగేట్ బాడ్సి శేఖర్ గౌడ్, మండల అధ్యక్షుడు సాయిరెడ్డి, మాజీ ఎంపీపీ యాదగిరి, నాయకులు, ప్రజాప్రతినిధులు మోహన్‌రెడ్డి, గొర్కంటి లింగం, ప్రతాప్‌సింగ్, కెతావత్ మోహన్ నాయక్, రాజేశ్, గోవూరు నరేశ్‌రెడ్డి, దేవ శంకర్, ఈశ్వర్ సింగ్, సత్యనారాయణ, సాయిరాం, మహేశ్, ముత్యంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాజీతోనే కేసుల పరిష్కారం

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల

ఖలీల్‌వాడి: రాజీతోనే కేసులు పరిష్కారమవుతాయని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, డీఎల్ఎస్ఏ చైర్‌పర్సన్ సునీత కుంచాల అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని జిల్లా న్యాయసదన్‌లో లోక్‌అదాలత్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి జడ్జి హాజరై మాట్లాడారు. కేసుల కోసం కోర్టుల చుట్టూ తిరగకుండా ఇరువురి సమ్మతితో లోక్ అదాలత్‌తో సివిల్‌తోపాటు రాజీపడే క్రిమినల్ కేసులు పరిష్కారమవుతాయని అన్నారు.

26,026 కేసుల పరిష్కారం

నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ కోర్టుల్లో 26,026 కేసులు పరిష్కారమైనట్లు జిల్లా జడ్జి సునీత కుంచాల తెలిపారు. ఈ మూడు కోర్టుల్లో 86 సివిల్ కేసులు, 15,666 క్రిమినల్ కేసులు, 10,234 లిటిగేషన్, ఇతర కేసులు పరిష్కారమైనట్లు చెప్పారు. జిల్లా న్యాయసేవాధికార అధికారులు, పోలీసులు, న్యాయవాదుల సహకారంతో కేసులను పరిష్కరించినట్లు పేర్కొన్నారు. కేసుల పరిష్కారంలో రాష్ట్రంలో జిల్లా 4వ స్థానం పొందినట్లు చెప్పారు. కార్యక్రమంలో డీఎల్ఎస్ఏ ప్రధాన కార్యదర్శి పద్మావతి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్‌మోహన్‌గౌడ్, హైకోర్టు బార్ అసోసియేషన్ సభ్యుడు రాజేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జడ్జి సునీత కుంచాల

విద్యార్థులకు డ్రామా పోటీలు

నిజామాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని హరిచరణ్ స్కూల్‌లో జిల్లాస్థాయి సైన్స్ డ్రామా పోటీలు శనివారం ఉత్సాహంగా జరిగాయి. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ పోటీలకు పది పాఠశాలల విద్యార్థులు వారి గైడ్ టీచర్లతో హాజరయ్యారు. ఇందులో ప్రధాన అంశంగా 'సైన్స్ అండ్ టెక్నాలజీ ఫర్ ద బెనిఫిట్ ఆఫ్ మెన్ కైండ్' అనే ప్రధాన అంశంలో ఐదు ఉపఅంశాలపై విద్యార్థులు డ్రామాను ప్రదర్శించారు. కార్యక్రమానికి హాజరైన జిల్లా సైన్స్ అధికారి గంగా కిషన్ మాట్లాడుతూ.. ప్రకృతి వనరుల సంరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఎంఈవో ఆర్‌వీఎస్ గౌడ్, ఎ గోవర్ధన్, ముద్దుకృష్ణ, సాయిబాబా, మమత, విద్యార్థులు పాల్గొన్నారు.



పెంపుడు జంతువులకు టీకాలు వేయించాలి

- జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి జగన్నాథచారి

డొంకేశ్వర్: పెంపుడు జంతువులకు తప్పనిసరిగా రేబిస్ టీకాలు వేయించాలని జిల్లా పశుసంవరక శాఖ అధికారి జగన్నాథచారి అన్నారు. నగరంలోని పశువైద్యశాలలో ప్రపంచ రేబిస్ దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పెంపుడు జంతువులకు రేబిస్ వ్యాధి నిరోధక టీకాలు వేశారు. రేబిస్ వ్యాధి ప్రాణాంతకమని, ఇది కుక్కకాటు, గబ్బిలాల వలన సోకుతుందన్నారు. ఎవరైనా కుక్కకాటుకు గురైతే వెంటనే కరిచిన చోట సబ్బునీళ్లతో శుభ్రం చేసి 24 గంటల్లోగా టీకా వేయించుకోవాలని సూచించారు. జిల్లా పశువైద్యశాలతో పాటు జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని మున్సిపల్, మండల కేంద్రాల్లోని పశువైద్య కేంద్రాల్లో కలిపి 456 కుక్కలకు యాంటీ రేబిస్ టీకాలు వేసినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏడీలు నసీర్ అహ్మద్, గంగాధరయ్య, మాజీద్, బస్వారెడ్డి, కిరణ్, హన్మంత్ రెడ్డి ఉన్నారు.



కుక్కలకు రేబిస్ టీకాలు వేస్తున్న జగన్నాథచారి

ఆర్అండ్‌బీ చీఫ్ ఇంజినీర్‌కు సన్మానం



నిజామాబాద్‌అర్బన్: రోడ్లు, భవనాల శాఖ చీఫ్ ఇంజనీర్ హన్మంత్‌రావును కలెక్టరేట్‌లో శనివారం నిర్వహించిన దిశ సమావేశం అనంతరం ఎంపీ అర్వింద్, ప్రజాప్రతినిధులు, అధికారులు ఘనంగా సన్మానించారు. త్వరలో పదవీ విరమణ చేయనున్న హన్మంత్ రావు.. సుమారు 38 ఏళ్లపాటు అందించిన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా హన్మంతరావు తన అనుభవాలను పంచుకున్నారు.

యూరాలజిస్ట్ శబరినాథ్‌కు అవార్డు

నిజామాబాద్‌నాగారం: జిల్లా కేంద్రానికి చెందిన ప్రముఖ యూరాలజిస్ట్ బిజ్జు శబరినాథ్‌కు అరుదైన అవార్డు దక్కింది. ది టైమ్స్ ఆఫ్ ఇండియా పత్రికకు చెందిన టైమ్స్ ఐకాన్ ఆఫ్ హెల్త్ కేర్ సంస్థ ప్రతి ఏడాది అందిస్తున్న అవార్డుల్లో భాగంగా ఈ ఏడాది యూరాలజిస్టులో ఉత్తమ సేవలు అందిస్తున్న శబరినాథ్‌కు అవార్డును అందించారు. శుక్రవారం రాత్రి హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర వైద్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ శబరినాథ్‌కు ఉత్తమ యూరాలజిస్టు పురస్కారాన్ని అందజేశారు.



క్రైం కార్నర్

వేర్వేరు ఘటనల్లో ఐదుగురి మృతి

నిజాంసాగర్(జుక్కల్): జుక్కల్ మండలం నాగుల్‌గావ్ శివారులో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కుమ్మరి సాయిలు(40) అనే వ్యక్తి మృతి చెందినట్లు ఎస్సై భువనేశ్వర్ తెలిపారు. మండలంలోని పెద్దఎడ్గి గ్రామానికి చెందిన సాయిలు బైక్‌పై నాగుల్‌గావ్‌కు వెళ్తుండగా ఎదురుగా వచ్చిన మరోబైక్ బలంగా ఢీకొన్నది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన సాయిలు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య కుమ్మరి లక్ష్మీబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

చెట్టును లారీ ఢీకొన్న ఘటనలో డ్రైవర్..



ఇందల్వాయి: ఇందల్వాయి–ధర్పల్లి రోడ్డు మార్గంలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ మృతి చెందినట్లు ఎస్సై మనోజ్ కుమార్ శనివారం పేర్కొన్నారు. అన్నాస్‌పల్లి నుంచి ఇందల్వాయి వైపు వస్తున్న సిమెంట్ లారీ లింగాపూర్ స్టేజ్ వద్ద అదుపు తప్పి చెట్టును ఢీకొన్నది. ఈ ఘటనలో తీవ్ర గాయాలైన డ్రైవర్ బిస్మిల్లా ఖాన్(35) మృతి చెందాడు. మృతుడు మంచిర్యాల జిల్లా కాశీపేట్ మండలం దేవాపూర్‌కి చెందినవాడిగా గుర్తించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మరొకరు..

బాన్సువాడ రూరల్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కడప జిల్లాలోని మైదుకూరులో జరిగిన రోడ్డు ప్రమాదంలో బాన్సువాడ పట్టణానికి చెందిన సయ్యద్ అహ్మదుల్లా(39) శనివారం మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. బాన్సువాడలోని వీక్లీ మార్కెట్‌లో నివాసం ఉండే అహ్మదుల్లా పని నిమిత్తం మైదుకూరుకు వెళ్లాడు. అక్కడ బైక్‌పై ప్రయాణిస్తుండగా టిప్పర్ ఢీకొన్నది. ఈ ఘటనలో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి వద్ద దొరికిన ఆధారాల ప్రకారం అక్కడి పోలీసులు బాన్సువాడ పోలీసులకు తెలుపగా వారు కుటుంబీకులకు సమాచారం అందించారు.

చేపల వేటకు వెళ్లి ఒకరు..

కామారెడ్డి క్రైం: చేపల వేటకు వెళ్లిన వ్యక్తి మృతి చెందిన ఘటన కామారెడ్డి మండలం రామేశ్వర్‌పల్లి శివారులో శనివారం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని బీడీ వర్కర్స్ కాలనీలో నివాసం ఉంటే కోదండం లాలూకు ఆరుగురు కుమారులు. వారిలో మూడో కుమారుడైన సారయ్య (41) శుక్రవారం సాయంత్రం తండ్రితో కలిసి చేపల వేటకు వెళ్లాడు. కొద్ది సేపటికి తండ్రి లాలూ ఇంటికి తిరిగి రాగా కుమారుడు సారయ్య చేపలు పట్టుకుని వస్తానన్నాడు. సారయ్య ఇంటికి తిరిగి రాకపోవడంతో శనివారం ఉదయం కుటుంబీకులు కుంట వద్దకు వెళ్లి గాలించగా ఆచూకీ దొరకలేదు. సాయంత్రం మృతదేహం నీటిపై తేలింది. సారయ్యకు ఫిట్స్ వ్యాధి ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ప్రమాదవశాత్తు నీట మునిగి మృతి చెందాడని కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజు పేర్కొన్నారు.

కాలువలో పడి ఒకరు..

నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్‌నగర్ మండలంలోని తుంకిపల్లి గ్రామానికి చెందిన మెట్టు సంజీవులు(56) అనే వ్యక్తి మిషన్ భగీరథ కాలువలో పడి మృతి చెందినట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు. మద్యానికి బానిసైన సంజీవులు మద్యం మత్తులో కాలువ పడి మృతి చెందాడన్నారు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

వృద్ధురాలి అదృశ్యం



సాయవ్వ

మద్నూర్(జుక్కల్): డోంగ్లీ మండలంలోని కుర్లా గ్రామానికి చెందిన మేత్రి సాయవ్వ అనే వృద్ధురాలు అదృశ్యమైనట్లు ఎస్సై విజయ్‌కొండ శనివారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. కుర్లా గ్రామానికి చెందిన మేత్రి సాయవ్వ ఈ నెల 27న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబీకులు పలుచోట్ల గాలించినా ఆచూకీ లభించలేదు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

హత్య కేసులో ఐదుగురి రిమాండ్

మోపాల్: మండలంలోని కంజర్‌లో మూడు రోజుల క్రితం జరిగిన నరహరి హత్య కేసులో ఐదుగురిని సీఐ సురేష్‌కుమార్ శనివారం రిమాండ్‌కు తరలించారు. బోయిని సత్యనారాయణ, లలిత, పూజిత, సందీప్, వంశీని రిమాండ్‌కు తరలించగా, హత్య కేసులో మరికొందరి పాత్రపై విచారణ చేపడుతున్నట్లు తెలిసింది. నరహరి హత్యలో 15 మంది వరకు ప్రత్యక్షంగా పాల్గొన్నారని ప్రత్యక్ష సాక్షులు, మృతుడి కుమారులు ఆరోపిస్తున్నారు. వారి పాత్రపై పోలీసులు విచారణ చేపట్టి, మరికొందరిని రిమాండ్‌కు పంపించే అవకాశముందని సమాచారం.

రైల్వే క్వార్టర్స్‌లో ఒకరి హత్య

ఖలీల్‌వాడి: నగరంలోని మూడో టౌన్ పీఎస్ పరిధిలో ఉన్న రైల్వే క్వార్టర్స్‌లో ఒకరు హత్యకు గురైనట్లు ఎస్సై మహేశ్ శనివారం రాత్రి తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. రైల్వే క్వార్టర్స్ ప్రాంతంలో ఓ వ్యక్తి మృతదేహం ఉందన్న సమాచారం మేరకు పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. కాగా మృతుడి వద్ద ఓ తాడు ఉండడంతో పాటు అతని మెడపై తాడు బిగిసిన గాటు ఉండడంతో హత్య చేసి ఉంటారని పేర్కొన్నారు. స్థానికుల సమాచారం మేరకు మృతుడిని నవీపేట్ మండల కేంద్రానికి చెందిన గణేశ్(30)గా గుర్తించినట్లు తెలిపారు. మృతుడికి ఎవరితోనైనా విభేదాలు ఉన్నాయన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. పోస్టుమార్టం అనంతరం పూర్తి వివరాలు తెలుస్తాయని ఎస్సై తెలిపారు.

విద్యుత్‌షాక్‌తో నెమలి మృతి



డొంకేశ్వర్: నిజామాబాద్ జిల్లా డొంకేశ్వర్ మండల కేంద్రంలో నెమలి విద్యుత్ షాక్‌తో మృతి చెందింది. స్థానిక రైతు గోపాల్ రెడ్డి శనివారం ఉదయం తన వ్యవసాయ క్షేత్రంలో కిందపడి ఉన్న నెమలిని గమనించి డిప్యూటీ ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ సుధాకర్‌కు సమాచారం అందించాడు. ఆయన వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ రతన్‌ను వెంటబెట్టుకుని ఘటన స్థలానికి చేరుకుని నెమలిని పరిశీలించారు. నెమలికి పోస్టుమార్టం నిర్వహించి విద్యుత్ వైర్లకు తగిలి షాక్‌తో మరణించినట్లుగా నిర్ధారించారు. ఉన్నతాధికారులకు సమాచారం అందించి నెమలి కళేబరాన్ని అక్కడే పూడ్చి పెట్టారు.

సీజ్ చేసిన ఇసుక వేలం

రుద్రూర్: పొతంగల్ శివారులో రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్న 60 ట్రాక్టర్ల ట్రిప్పుల ఇసుకను తహసీల్ కార్యాలయంలో శనివారం వేలం నిర్వహించారు. వేలంలో పొతంగల్ గ్రామానికి చెందిన సూదం వినోద్ రూ. 66 వేలకు దక్కించుకున్నట్లు తహసీల్దార్ మల్లయ్య పేర్కొన్నారు.

వంశి హోటల్‌లో అధికారుల తనిఖీలు



ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలోని వంశి ఇంటర్నేషనల్ హోటల్‌లో ఉన్న బార్‌తోపాటు వైన్స్‌లో పట్టణ ఎక్సైజ్ ఎస్‌హెచ్‌వో దిలీప్ ఆధ్వర్యంలో శనివారం రాత్రి తనిఖీలు చేపట్టారు. సాధారణ తనిఖీల్లో భాగంగానే హోటల్‌ను తనిఖీ చేసి, స్టాక్ వివరాలు తెలుసుకున్నట్లు ఎస్‌హెచ్‌వో పేర్కొన్నారు. తనిఖీలో ఎక్సైజ్ ఎస్సై సుష్మ, సిబ్బంది ఉన్నారు.

కారు, ఆటో ఢీకొని నలుగురికి గాయాలు

ఎడపల్లి: కారు, ఆటో ఢీకొన్న ఘటనలో నలుగురికి గాయాలైన ఘటన మండల శివారులో శనివారం చోటు చేసుకుంది. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. బోధన్ నుంచి కారు, ఆటో నిజామాబాద్ వైపునకు వస్తుండగా అదే ప్రాంతంలో బైక్‌పై వెళ్తున్న ఓ వ్యక్తి కారును ఓవర్ టేక్ చేయగా కారు నడిపే వ్యక్తి సడన్ బ్రేక్ వేశాడు. దీంతో కారు వెనుకాలే వస్తున్న ఆటో కారును ఢీకొన్నది. ఈ ఘటనలో ఆటోలో ఉన్న నలుగురు మహిళలకు గాయాలయ్యాయి. గాయపడ్డ వారిని స్థానికులు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

వాగులో పడి ఇద్దరికి ..

నవీపేట: మండలంలోని జన్నేపల్లి వాగులో ప్రమాదవశాత్తు పడి ఇద్దరికి గాయాలైనట్లు గ్రామస్తులు శనివారం తెలిపారు. నందిపేట మండలం కంఠం గ్రామానికి చెందిన రమేశ్, యశ్వంత్ బైక్‌పై జన్నేపల్లికి వస్తుండగా మార్గమధ్యలో జన్నేపల్లి వాగు వద్ద ప్రమాదవశాత్తు బైక్ అదుపుతప్పి వాగులో పడింది. ఈ ఘటనలో వీరికి గాయాలయ్యాయి. వంతెనకు ఇరువైపులా సైడ్‌వాల్స్ లేకపోవడంతో ఈ ప్రమాదం జరిగింది. స్వల్పగాయాలు కావడంతో స్థానికులు ఆస్పత్రికి తరలించారు.